

# దొరసానమ్మ కుక్క

సంపత్ కుమార్.

"జట్కా సాహేబుకు ఐదువందలు జరిమానా, ఆరునెల్లు కఠినశిక్ష:"

ఈ పెద్దక్షరాల హెడ్డింగుచూసేప్పటికి, క్రిందున్న చిన్నక్షరాలని కూడా చదివేయా లనిపించింది. కాని సమాప్తం అయింతర్వాత యీ రామాయణానికి రేపనింగ్ కాలంలో ఒక పేజీ ఎందుకు తగలెట్టాడా పిచ్చి ఎడిటర్ అనుకున్నా! పాపం! ఎడిటర్‌కి ఏమీ జబ్బులేదని తెలిసిం దాతర్వాత!!

పోలీసుల వుత్తకాళ్ళు ఎత్తుపల్లాల్ని దుమికేస్తున్నాయి. సబ్ యినస్పెక్టర్ సైకిలు బెల్ పడుకున్నవాళ్ళని చెదరగొడుతూంది. సర్కిల్ యినస్పెక్టరు కారు రోడ్డ దుమ్ము లేపేస్తూంది. ఈ అలజడికి జనమంతా బెదురుతూ చూస్తున్నారు.

"ఏయ్!—" ఆ పోయే మనిషి వులిక్కిపడి ఆగి, వెనక్కి చూసి వణకిపోయాడు. పోలీసు కర్కశపు చూపులికి పీనుగై, మాట్లాడలేక తెల్లబోయి చూస్తూ నిలబడ్డాడు.

"దొరగారి కుక్క కనిపించిందా?" అడిగాడు కొట్టేవానిలా నిలబడి.

"లేదండి—" అతని పెదాలు వణకాయి.

"లేప్—నై? తెర...మాకే—" లాటీ ఎత్తాడు.

"ఏయ్ సైటు!"

అదరిపడి వెనక్కి చూశాడు. గబగబా వెళ్ళి సబ్ యినస్పెక్టర్‌కు సలాం కొట్టి, కొయ్యలా నిలబడ్డాడు.

"కనబడిందా?"

"నై సాబ్"

"ఏడిసావ్ యింకా నైసాబ్ దగ్గే వుందీ! ఎందుకూ పనికిరావు నీవు" అని సైకిలు ఎక్కి, "ఒక గంటలో కనుక్కోపోతే నీ వుద్యోగం మరచుకో" అంటూ కుడి పెడల్‌ని ఒక్క తన్ను తన్నాడు. పెడలు విరిగి గజం దూరాన పడింది. పోలీసు కంగారుపడుతూ పోయి, రాంగ్ సైడ్ పోయిన సైకిల్ ఒకదాన్ని లాక్కొచ్చి ఇచ్చాడు. ఆ సైకిల్ ఎక్కి, "అబ్దుల్! కుక్కని త్వరగా పట్టుకోకపోతే మన వుద్యోగాలు దక్కవు — అది దొరది పైగా!" అంటూ పెడల్ తొక్కుతూ సాగిపోయాడు.

ఆఫీసు మెట్లెక్కుతున్నాడు. హారన్ విని తిరిగి చూశాడు. గబగబా దిగబోయి, మెట్లకి సాష్టాంగమై కారు దగ్గఱకు పరుగెత్తాడు.

"జాడ దీశారా?" అడిగాడు సర్కిల్!

"లేదు సార్! కొన్ని స్థలాల్ని గాలించి వచ్చాను. సార్, మరికొన్ని స్టేషన్‌లకి ఫోను చేయాలని పోతున్నాను."

"సరే — ఎట్లా అయినా సరే తెల్లారేలోగా పట్టాలి. దొరగారు మండిపోతున్నారు!"

"సార్!—"

"సార్ గీర్ కట్టిపెట్టు కావలసింది కుక్క!" అంటూ కారు ముందుకు నడిపించారు. తాసిల్దారుగారి ఇంటివద్ద ఆపి, "ఏమోయ్ అప్పన్నా!" పిలిచారు. అప్పన్న నివ్వెరబోయి, బీడీ వెనక్కి పారేసి, కిందున్న డవాలా మెళ్ళో వేసుకొని, కారు దగ్గఱకు ఉరికాడు.

"తాసిల్దారువారున్నారా అప్పన్నా?"

"చిత్తం!" అన్నాడు డవాల్ సవరించుకుంటూ.

"ఏం—కోపంగా వున్నారా?"

"ఏ-మో-నండి" బుఱ్ఱ గోక్కొని, "అనుకుంటా-నండి" అన్నాడు. సర్కిల్ నవ్వి, "అవలించకపోతే టీ తాగి రారాదూ?" అంటూ జేబులో చేయి వేశాడు.

"ఈ అర్థరాత్రి టీ ఎక్కడ దొరుకుతుందండీ?" సణిగాడు ఒక చేత్తో తల గోక్కొంటూ, మరో చేయి చాపి!

"పోవోయ్—" అంటూ వాని చేతిలో రెండణాలు పెట్టాడు.

"అయ్యగారు ఏం చేస్తున్నారో చూసి వస్తా

నుండండి" అంటూ వెళ్ళి, నిముషంలో తిరిగివచ్చి, "ఆఫీసులో ఏవో కాగితాలు రాసుకొంటున్నా రండి" అని చెప్పాడు.

కారు డోర్ తెరచి, ఏనుగు కాళ్ళని బైటపెట్టటానికి అవస్థ పడుతున్నాడు. అది చూసి కలత పడి, "ఉండండయ్యా" అని, "ఒరేయ్ చాకలీ! ఇట్లా తొందరగా రారా!" అని కేకేశాడు అప్పన్న.

అప్పన్న కేకకి కునుకుపాట్లు పడుతూన్న చాకలి వులికిపడి లేచి, నోట్లో మలుగుతూన్న అకు చుట్టని కంగారుతో మొల్లోకి దోపేసి, తలగుడ్డ సరిజేసుకొంటూ కారు దగ్గఱకి వచ్చాడు. ఎవరూ చెప్పక పోయినా, అక్కడి విషయాన్ని అర్థం చేసి కొన్న చాకలి అయ్యావార్లు దిగడానికి సహాయ మయ్యాడు.



పొట్టి ఫంట్లాము బొజ్జమీదికి లాక్కొని, మెల్లెక్కుతున్నాడు. బూట్ల శబ్దం విని. తాసిల్దారువారి సతీమణి కంగారుపడి, చూస్తూన్న బొమ్మల పుస్తకాల్ని టేబిల్ క్రింద జార విడిచి అదృశ్యమై పోయింది.

సర్కిల్ యినస్పెక్టరుని చూడగానే తాసిల్దారు ముఖంలోని సరసం విరసంగా మారింది. "ఏంటీ సంగతి?" అన్నాడు విసుగ్గా.

"పట్టణం అంతా గాలిస్తున్నాను. ఎక్కడైనా వుంటే దొరుకుతుంది" అంటూ టేబిల్ క్రిందకి చూపుల్ని పోనిచ్చాడు. నాయుడి ఒళ్లు ఝల్లు మంది. నగ్న దేహంమై పువ్వుల్లో రహస్య స్థానాన్ని కప్పుకొని పడుకున్న దొరసాని రంగు పెదాలమీద దొర ముద్దుల్ని గురిపెడుతున్నాడు! తాసిల్దారు ఎంత అదృష్టవంతుడు!! తీయని జలం ప్రవహించిం దాతని నోట్లో!

"నాన్సెన్సు—" ఉలిక్కిపడ్డాడు సర్కిల్!

"వెధవ ముస్తాబూ నువ్వూ పని సున్నా" — రిమార్కు కూడా వేశారు తాసిల్.

"తమర ట్లాసెలవిస్తే"

"ఏంటి సెలవు? వెధవ సెలవు!" చీదరించాడు.

"బహుశా ఒకవేళ బంగాళాతోటలో ఎక్కడైనా వుందేమో?" అని అనుమాన భావంతో మీసాల్ని మెలిపెడుతూ, బూటుతో కొన్ని పేజీల్ని తిప్పాడు.

"వెధవ యిండియన్ ఎడ్స్! ఇట్లాంటి తల లుండబట్టే దేశం యిట్లా ఏడుస్తూంది—"

"చిత్తం!" అన్నాడు. పూవుల్ని తొలగించి, లేడీలోని మధువుని స్వేచ్ఛగా గ్రోలుతూన్న దొరతో తానూ మైమరచిపోతూ!—

తాసిల్దారు వారి కోపాగ్ని మీద పెట్రోలు పడింది.

"ఏం చిత్తం? దొరవారన్న భయం కూడా లేదు" అంటూ సర్కిల్ వైపు చురచురచూశాడు...

నివ్వెరబోయాడు.

ఆశ్చర్యంగా, అనుమానంతో అతని చూపుల్ని వెంటాడారు తాసిల్దార్! తాసిల్దారువారి పవర్ జైలులో పడింది!!

వెంటనే లేచి, పంచె సరిజేసుకొంటూ, "లేవోయ్ నాయుడూ! పోయి చూదాం..." నాయుణ్ణి డిస్టర్బ్ చేశాడు. ఇద్దరూ కలసి బంగళావైపు వెళ్లారు. బొట్లేర్ని పిలిచి,

"దొరగాడు ఏం చేస్తున్నాడు?" అని ప్రశ్నించాడు తాసిల్దార్.

"స్సీసా మూత తీస్తున్నాడు!" అన్నాడు పెదాల్ని ఆడించకుండా.

"కోపించారా?—"

"లేదు. కాని దొరసానమ్మ చాలా కోపంగా ఉంది. గలాటా!" అన్నాడు ముఖం అదోమాదిరిగా పెట్టి.

"చూశావా ? వెధవలు మీరు" అని గర్జించాడు సర్కిల్ వైపె.

"తమ చిత్తం—"

"ఏం చిత్తం ? వెధవ మీసాలూ, నీవూ !" ముగించాడు విసుగ్గా.

దూరాన్నుంచి తలారి రాముడు బొల్లెరుకు సైగ చేశాడు. బొల్లెరు సంతోషంతో వెళ్ళి, వాని చేతిలోని కోళ్ళని అందుకుంటూ, "యారు పంపారు ?" అని అడిగాడు.

"సర్కిల్ దొరవారు"

"ఆ కూరగాయ లేరికి ?"

రాముడు కొంచెం కలతా, కొంచెం సిగ్గూ పడుతూ, "ఏం లేదయ్యా తాసిల్ దారు గారికి—" అన్నాడు మెల్లిగా.

ఆ మాటలు తాసిల్ దారు చెవిలో పడ్డాయి. సర్కిల్ వైపు చూసి, "ఎట్లాగోయి నాయుడూ? సరే, ఆ బూట్లూ గీట్లూ లాగేసి నిశ్శబ్దంగా తోటలో వెతుకు" అన్నాడు. లంచం ఎట్లాంటి వాణ్ణయినా లొంగదీస్తుంది ఖాబోలు !

సర్కిల్ యినస్పెక్టర్ చిన్న టార్చితో ఒక్కొక్క బిట్టూ వెతకుతున్నాడు. అల్లా అల్లా వెతుక్కుంటూ పోతూ పోతూ అప్రయత్నంగా అట్లా కిటికీలోనికి చూశాడు. అతని కళ్ళు జిగేల్ మన్నాయి. నరాలిని ఏదో మీటింది. పౌరుషం, కర్కోటకం అంతా బొజ్జ కిందికి దిగిపోయాయి దొరసానమ్మని చూసేసరికి! దీపాల కాంతుల్లో తెల్లని శరీరం నిగనిగ లాడుతూంది. ఏదో కూనిరాగం తీసుకొంటూ అద్దంలో తన గిరజాల జుట్టును సరిజేసికొంటూ, పౌడర్ వంటికికొట్టుకుంటూ తన వక్షోజాల క్రింద జారుతూన్న నీడల్ని చూసుకోని రిసిపోతోంది భర్త ముందు !......

బ్లా కాట్ బెడ్ రూంలో సిగ్గులు పడే తన భార్యని తలుచుకోని "రబిష్ !" ఆ శబ్దం పెదాల నుండి మీసాల్ని దూసుకొని వెలువడింది.

దొరగారు గ్లాసులోని విస్కీ కాళీచేసి, తూలుతూ వచ్చి, 'మై డార్లింగ్!' అంటూ భార్యమీద చేయి వేశాడు. "ఛీ!" అని చేయి లాగేసింది.

"నా కుక్క పోయాక యివన్నా ఎందుకు?" అని సణిగింది. దొర నవ్వి, 'కుక్కని వెతుకుతున్నారు' అన్నాడు.

దొరసానమ్మ పరుపుమీద కూర్చుంది చేతులు వెనక్కి ఆనించి.

"ముచ్చటైన కుక్క !" ఆమె పెదాల్లో శబ్దించింది.

"నన్ను యిలా చూస్తే అలా ఉరకలు వేసుకుంటూ వచ్చి వొళ్ళో కూచుంటుంది. నా కళ్ళను నాకుతుంది, శరీరాన్ని చుంబిస్తుంది. ఎంత ప్రేమ!" దొరసాని శరీరం పులకించింది. ఆతన్మయంలో పరుపు మీదకు వాలింది! సర్కిల్ గాబరాపడి, వేనక్కి తిరగబోయి కిందపడ్డాడు.

ఇంతలో విజిల్సు వినబడ్డాయి. ఆత్రుతతో లేచి పరుగు దీశాడు. రోడ్డుమీది గుంపులోకి దూరాడు. రక్తం కక్కుకోని చచ్చిన కుక్కని చూసేసరికి సర్కిల్ వారి గుండె గుభేలుమంది!

"సలాం సాబ్ ! నాకేమీ తెలియదు సాబ్ ! నిద్దట్లో ఏదో మొర్రో అన్నట్లు వినబడి, లేచి చూస్తి గదా...కుక్క మీదనుంచి మిలిటరీ లారీ ఒకటి పోయింది. కేక లెట్టినా ఆపలేదు సాబ్ ! ఆ తర్వాత పడుకున్నా విచారంతో" అని వేడుకున్నాడు జట్కావాలా.

"ఏడిశావ్....బద్మాష్ !" అని గర్జించాడు యినస్పెక్టర్.

"మాట్లాడితే, వెధవలికి మిలిటరీ లారీలు? నోటి మీద పొడుస్తాను వెధవ" అని ఘూంకారించాడు సర్కిల్ !

"వీడిది పొయ్యి సార్! వీడు తోలుతూంటేనే పట్టుకున్నా" అన్నాడు కానిస్టేబుల్ — పళ్ళు పటపటా కొరుకుతూ.

ఆ గుంపులోనుండి ఎవరో, "కాదండీ మిలిటరీ లారీయే నండీ!" మాట పూర్తవకుండానే లాటీ వాని నెత్తిన పడింది.

"న్యాయంకాదు సాబ్ ! తెల్లారి బండికి ఆ పక్కీధి వాళ్ళు జట్కా కావాలన్నారు. అందుకు తోలుకపోతున్నా సార్" అంటూ వేడుకోబోయాడు. "చెప్ నోరుముయ్యి వెధవ" అని ఒకటి మోదాడు.

జట్కావాణ్ణి దొరముందర పెట్టారు. దొరగారు తీర్పు చెప్పారు.

"ఆర్నెల్లు కఠిన శిక్ష. అయిదు వందల జరిమానా!" అని......

"వెధవ తీర్పు—"అంది—దొరసాని పెదాలమీద విడిన శబ్దము గదినంతా భీభత్సవాన్ని పొందించింది.

"నా కుక్క పోయింది. వాడికి శిక్ష పడితేనేం? ఆ కుక్కలా నన్ను ఆనందింపజేసే వెధవ ఒక్కడేనా ఉన్నాడా ఈ ప్రపంచంలో ?" అని ఒక నిట్టూర్పు విడిచింది.